క్లుప్తంగా

మాజీ ఉపరాష్ట్రపతికి ఆహ్వానం



మాజీ ఉప రాష్ట్రపతికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు

పెద్ద శంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఈనెల 21 నుంచి 23 వరకు సీతారామచంద్ర స్వామి పునః ప్రతిష్ఠ మహోత్సవాలకు రావాలని కోరుతూ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు రామాలయ అధ్యక్షుడు కనకరాజు ఆహ్వాన పత్రికను అందజేశారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లోని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు నివాసంలో కలిసి పెద్దశంకరంపేటలో నిర్వహిస్తున్న సీతారామచంద్రస్వామి పునః ప్రతిష్ఠ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి



చండూర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఏపీఎం ప్రేమలత

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు పూర్తి సహకారం అందిస్తేనే ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతాయని ఏపీఎం ప్రేమలత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చండూర్ రైతులతో ఆమె మాట్లాడుతూ.. చండూర్‌లో ఇప్పటివరకు సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నడిచేదన్నారు. ప్రస్తుతం గ్రామానికి ఐకేపీ ఆధ్వర్యంలో కేంద్రం మంజూరు అయిందని, రైతుల పూర్తి సహకారం అందించాలని కోరారు. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా లేకుండా కేంద్రానికి తీసుకురావాలన్నారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు జరిపితే తమ పూర్తి సహకారం ఉంటుందని రైతులు తెలిపారు. ముఖ్యంగా గన్నీ బస్తాలు, లారీల కొరత తదితర సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

వరంగల్ బహిరంగ సభకు తరలిరావాలి



కొడిపల్లిలో చలో వరంగల్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా ప్రజలు తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్ తెలిపారు. శుక్రవారం కౌడిపల్లిలో చలో వరంగల్ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్నింట్లో నంబర్‌వన్‌గా ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాజు, రుద్రప్ప, నాయకులు ఎల్లం, ప్రవీణ్ కుమార్, శ్యాంసుందర్‌రావు, కాంతారావు, అమర్‌సింగ్, నరహరి, గౌరీరెడ్డి, కుమార్, రవి సాగర్, ప్రతాప్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉపాధిహామీ పనులు



ఉపాధిహామీ పనుల్లో కూలీలు

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పనులు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పేట శివారులో కొనసాగుతున్న ఫిష్‌పాండ్, ఫార్మేషన్ రోడ్డు పనులు ఆయన పరిశీలించారు. కూలీలకు కొలతలు, పనులపై వివరించాలని, వేసవిలో జాగ్రత్తలు పాటించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం మస్టర్లు, కూలీల హాజరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ రమేశ్ ఉన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన

శివ్వంపేట(నర్సాపూర్): భూ భారతిపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్ తెలిపారు. శివ్వంపేట రైతు వేదికలో ఉదయం 10 గంటలకు నిర్వహించే అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరు అవుతున్నట్లు చెప్పారు. మండలంలోని రైతులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

వడగళ్ల వానతో పంట నష్టం

- ఆందోళనలో రైతులు
- ఆదుకోవాలని వేడుకోలు

నర్సాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పెద్ద చింతకుంట, చిన్నచింతకుంట, రెడ్డిపల్లి, గొల్లపల్లి, బ్రహ్మణపల్లి, రుస్తుంపేట తదితర గ్రామాల్లో వడగళ్ల వానతో చేతికొచ్చిన వరిపంట పాడైంది. గురువారం రాత్రి నుంచి కురిసిన వడగళ్ల వానతో సుమారు వెయ్యి ఎకరాల్లో వరి పంట నీటి పాలైంది. శుక్రవారం సాయంత్రం కురిసిన వానకు మరిన్ని పంట పొలాలు మునిగిపోయాయి. కాగా గాలిదుమారంతో పాటు వడగళ్ల వాన కారణంగా సుమారు పదెకరాల్లో మామిడితోటలోని కాయలు నేలరాలాయి.

రైతులను ఆదుకోవాలి

వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు శుక్రవారం వేర్వేరుగా మండలంలోని పంట నష్టపోయిన రైతులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటలకు ప్రభుత్వం బీమా చేయనందున రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన ప్రతీ రైతులకు పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తమవంతు కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ చెప్పారు. వడగళ్ల వానతో పంటు పాడైన గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటనష్టాల వివరాలు మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని, రైతులకు అండగా ఉంటుందని ఆయన చెప్పారు.



వడగళ్ల వానతో నష్టపోయిన పంటపొలం

దెబ్బతిన్న పంటల పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని శాలిపేట గ్రామంలో సుమారు 70 ఎకరాల్లో వడగళ్ల వర్షంతో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. శుక్రవారం శాలిపేట గ్రామంలో వడగళ్లతో దెబ్బతిన్న వరి పంటలను వ్యవసాయ అధికారి లక్ష్మీప్రవీణ్, ఏఈఓ శేఖర్ పరిశీలించారు. గురువారం కురిసిన వడగళ్ల వర్షంతో వరి పంట ధాన్యం గింజలు రాలిపోయి రైతులకు నష్టం జరిగిందని, శాలిపేట గ్రామంలో 120 మంది రైతులకు చెందిన 70 ఎకరాల్లో వరి నష్టపోయిందని ఏఓ తెలిపారు. రైతుల వివరాలతో కూడిన నివేదిక ఉన్నత అధికారులకు పంపిస్తామన్నారు.



శాలిపేటలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు ప్రవీణ్, శేఖర్

మట్టి, ఇసుక తరలింపుతో ఇక్కట్లు

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వెళ్తున్న లారీలు, టిప్పర్లతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. తూప్రాన్ – నర్సాపూర్ హైవేపై నుంచి నిత్యం డస్ట్, ఇసుక తరలింపులో నియమాలు పాటించడంలేదు. మట్టి, ఇసుక లోడింగ్ అనంతరం కవర్‌తో కప్పేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేయాల్సి ఉండగా, అవేవి పట్టించుకోక రోడ్డుపై వెళ్తుండడం వల్ల వాటి వెనకాల వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో డస్ట్, ఇసుక పడుతోంది. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత ఆర్‌టీఏ, పోలీసు అధికారులు స్పందించి తూప్రాన్ – నర్సాపూర్ హైవేపై నిత్యం నిబంధనలకు విరుద్ధంగా వెళ్తున్న టిప్పర్లు, లారీలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం గురించి ఎస్ఐ మధుకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వెళ్తున్న లారీలు, టిప్పర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



హైవేపై డస్ట్‌లోడ్‌తో వెళ్తున్న మినీ టిప్పర్

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు



కొడిపల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు



పెద్ద శంకరంపేట(మెదక్): సీఎస్ఐ చర్చిలో..

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చితో పాటు ఆయా గ్రామాల్లో చర్చిల వద్ద గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. సీఎస్ఐ చర్చి ఫాస్టర్ ఎస్.దేవవరం ఏసుక్రీస్తు బోధనలను చదివి వినిపించారు. అనంతరం భజనలు, కీర్తనలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను క్రిస్టియన్లు ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రం కౌడిపల్లి సీఎస్ఐ చర్చిలో ఫాస్టర్ జైపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో పాటు వెల్మకన్న, కొట్టాల, కంచన్‌పల్లి, కన్నారం, రాయిలాపూర్, తునికి తదితర గ్రామాల్లో సీఎస్ఐ, ఇండిపెండెంట్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా బేతాళ స్వామికి బండ్ల ఊరేగింపు



జన సంద్రంగా మారిన బేతాళ స్వామి ఆలయం

అల్లాదుర్గం (మెదక్): అల్లాదుర్గంలో కొలువుదీరిన బేతాళ స్వామి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం బేతాళస్వామికి బండ్లను కట్టి, భక్తులు ఊరేగింపుగా వెళ్లి స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చిన్న పిల్లలు, పెద్దలు బండ్లను పోటా పోటీగా అలంకరించి డాన్సులు, నృత్యాలు చేశారు. యువకులు చిన్న బండ్లకు కట్టి ఊరేగించారు. అల్లాదుర్గం, రెడ్డిపల్లి, వెంకట్‌రావుపేట, బహిరన్‌దిబ్బ, పెద్దశంకరంపేట మండలం ముసాపేట గ్రామాలకు చెందిన భక్తులు మొక్కలను తీర్చుకునేందుకు ఎండ్లబండ్లతో బేతాళుడికి ప్రదక్షిణలు చేశారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డితో పాటు టేక్మాల్, పెద్దశంకరంపేట ఎస్ఐలు ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. జాతరను చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు. బేతాళ స్వామి ఆలయ ప్రాంతం జనసంద్రంగా మారింది.



బేతాళ స్వామి బండ్ల ఊరేగింపులో భక్తులు

20న ఎంజేపీ గురుకుల బ్యాక్‌లాగ్ ప్రవేశ పరీక్ష

కౌడిపల్లి(నర్సాపూర్): ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో ఈనెల 20న 6 నుంచి 9వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల అడ్మిషన్లకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని మండలంలోని తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ హరిబాబు శుక్రవారం తెలిపారు. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మెదక్‌లో మూడు, తునికి ఎంజేపీ గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 20న జరిగే ప్రవేశ పరీక్షకు మొత్తం 807 మంది విద్యార్థులు హాజరుకానుండగా, ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలన్నారు. మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా ఎంపిక చేస్తామని చెప్పారు.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం



పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): రాజ్యాంగ పరిరక్షణ కోసమే కాంగ్రెస్ పోరాడుతుందని నార్సింగి మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి జూకంటి రాజాగౌడ్ అన్నారు. శుక్రవారం నార్సింగి మండలంలోని బీమ్‌రావుపల్లి గ్రామంలో జైబాపు, జైబీమ జై సంవిధాన్ యోజన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రాజాగౌడ్ మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల హక్కులను కాలరాసేందుకు రాజ్యాంగ సవరణ చేసేందుకు జరుగుతున్న కుట్రలను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

నర్సాపూర్: సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె నర్సాపూర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యుడు నాగరాజు గౌడ్, తన తల్లిదండ్రులు కమలమ్మ, వెంకటస్వామి గౌడ్‌ల స్మారకార్థం నర్సాపూర్ పట్టణంలో సంత రోజు ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఏటా వేసవిలో అమ్మనాన్నల స్మారకార్థం అంబలి కేంద్రం ఏర్పాటు చేసి, ప్రజల దాహం తీర్చడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అంబలి అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

పాఠశాలల్లో ఓఆర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి ఇబ్బందులపై గత నెలలో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అందుకు గాను మాజీ జెడ్పీటీసీ మహేశ్ గుప్తా స్పందించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో తన సొంత నిధులతో మినీ ఓఆర్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. శనివారం మహేశ్‌గుప్తా మాట్లాడుతూ.. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పున: ప్రారంభం అయ్యేవరకు హైస్కూల్స్‌లోని వాటర్ అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

చినుకు పడినా.. గాలి వీచినా అంధకారం

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరా నిర్వహణ సరిగా లేనందున చినుకు పడినా.. గాలి వీచినా కరెంట్ సరఫరా నిలిచిపోయి ప్రజలు అంధకారంలో ఉండాల్సి వస్తోంది. గురువారం రాత్రి గాలి దుమారంతో పాటు వడగళ్ల వాన కురవడంతో పట్టణంలో సుమారు మూడున్నర గంటల పాటు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అంధకారంలో మగ్గారు. శుక్రవారం కొంతసేపు గాలి వీచి వర్షం కురువడంతో సుమారు గంటన్నర సేపు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. పట్టణంలో వర్షం వస్తే కరెంట్ పోవడం సర్వసాధారణం మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అర్ధరాత్రి సైతం పలుమార్లు కరెంట్ పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై మండల ఏఈ రాంమూర్తిని వివరణ కోరగా సాంకేతిక సమస్యలతో కరెంట్ నిలిచిపోయిందన్నారు.

వసతుల కొరత లేకుండా చూడండి



హవేళిఘణాపూర్(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్



సూరారంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ సత్యనారాయణ



చిన్నఘనాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

హవేళిఘణాపూర్(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఎలాంటి వసతుల కొరత లేకుండా చూడాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం మెదక్ మండలం రాజ్‌పల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో ఏ పంటలు సాగు చేశారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌చౌదరి, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

సూరారంలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ పవన్‌గౌడ్, ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, సీఈఓ పాషా పాల్గొన్నారు. అలాగే నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ కరీం, ఎంపీడీఓ ఆనంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఓ అశోక్, సీసీలు సుల్తానా, శంకర్, కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్, నర్సింహులుగౌడ్, స్వప్న, లక్ష్మినర్సింహులు, బాలాజీ, భరత్ పాల్గొన్నారు.

చిన్నఘనాపూర్‌లో..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు చేపట్టాలని అక్కడి పాలకమండలిని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నాగయ్య, వైస్ చైర్మన్ రాజు, డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, నగేష్, మొగలమ్మ, నర్సింలు, మల్లేశం, విఠల్ గౌడ్, సామెల్, బీఆర్ఎస్ నాయకులు బాగారెడ్డి, సంతోష్ కుమార్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మన్ పరమేశ్ మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ సత్యనారాయణ, హరిశంకర్, మల్లేశం, అంబరీష, బాలరాజు, రాజు, గోవర్ధన్‌రెడ్డి, రాములు, నరేశ్, ఆనందం తదితరులు ఉన్నారు.



చేగుంట(తూప్రాన్): రెడ్డిపల్లిలో..

చిన్నఘనాపూర్‌లో..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు చేపట్టాలని అక్కడి పాలకమండలిని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నాగయ్య, వైస్ చైర్మన్ రాజు, డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, నగేష్, మొగలమ్మ, నర్సింలు, మల్లేశం, విఠల్‌గౌడ్, సామెల్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బత్తుల చంద్రంపై దాడి అమానుషం

చేగుంట(తూప్రాన్): సిద్దిపేటలో దళిత సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రంపై దాడి అమానుషమని సంఘం జిల్లా నాయకులు శేఖర్ అన్నారు. శుక్రవారం దళిత సంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిద్దిపేట అంబేడ్కర్ కాలనీ హనుమాన్ దేవాలయం విషయంలో కొందరు వ్యక్తులు చంద్రంపై దాడి చేశారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నరేశ్, బాబు, వెంకటి, నర్సయ్య దుర్గయ్య ప్రభాకర్ పాల్గొన్నారు.

◆ అంబేడ్కర్ విగ్రహానికి రక్షణ కల్పించాలి

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో ఇటీవల ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి రక్షణ కల్పించాలని కేవీపీఎస్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నాగరాజు శుక్రవారం కోరారు. విగ్రహాన్ని తొలగించాలంటూ ఒక వర్గం వారు ఆందోళన చేపట్టడం సరికాదని, భారత రాజ్యాంగం రచించిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ విషయంలో పోలీసులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ అనాథ పిల్లలకు ఆర్థిక సాయం

పాపన్నపేట(మెదక్): తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు దుబ్బాక సద్గురు స్వామి సమర్థ మహారాజ్ తరఫున కొత్త విశాంత్ శుక్రవారం కుర్తివాడలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాథ పిల్లల గురించి తెలుసుకున్న స్వామి తన తరఫున వారికి రూ.11 వేలు అదజేయాలని కోరాడని తెలిపారు. సామాజి సేవలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించనట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు శ్రీనివాస్, మధు, అనాథ పిల్లల బంధువు కమలాకర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం నర్సంపల్లితండాలో సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.5 లక్షల ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు రాజాగౌడ్, గోవర్ధన్, రాజేష్, రాజేందర్, వినోద్, శంకర్ నాయక్, రాములు నాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ గణేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాతీయ రహదారి 765 డీజీ పనుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. కావున గ్రామంలోని అధికారులు, వ్యాపారస్తులు, వినియోగదారులు సహకరించాలన్నారు.

◆ వేసవిలో తాగునీటి సమస్య రానివ్వం

గజ్వేల్: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూస్తామని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌లో కొంతకాలంగా తాగునీటి సమస్య తలెత్తడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం బోరు బావిని తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య గురించి మూడు రోజుల క్రితమే తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సమస్య పరిష్కారానికి బోర్లు వేయిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్య ఉత్పన్నమైనా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

◆ కనీస సౌకర్యాలు కల్పించండి

తొగుట(దుబ్బాక): ఉపాధి హామీ కూలీలు పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గోవర్ధనగిరి, వర్ధరాజుపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు కొనసాగినన్ని రోజులూ తాగునీరు అందజేస్తామన్నారు.